

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980


నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.144	209	238
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.144	209	238

ఉష్ణోగ్రత గరిష్ఠం 30.5 । కనిష్ఠం 20.0



నల్లగొండ జిల్లా కేంద్రం హనుమాన్‌నగర్‌లో ప్రతిష్ఠించిన 18 అడుగుల హనుమాన్ ఏకశిల విగ్రహం

అభయమివ్వు.. ఆంజనేయ

అట్టహాసంగా ఏకశిల విగ్రహ ప్రతిష్ఠ



నల్లగొండ జిల్లా కేంద్రం హనుమాన్‌నగర్‌లో 18 అడుగుల ఏకశిల విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం అట్టహాసంగా సాగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని కన్నులారా వీక్షించి పరవశించారు.

•7లో..



స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు డబ్బు చెల్లింపునకు జాబ్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా లేదా పోస్టాఫీసు ఖాతా అనుసంధానం చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో పలువురు కూలీలు పనులకు దూరమవుతున్నారు. ఆధార్ అనుసంధానం కాకపోవడమే అందుకు కారణంగా చెబుతున్నారు. ఆధార్ అప్‌డేట్ అనుసంధానం సకాలంలో జరగకపోవడంతో తాము ఉపాధి కోల్పోవాల్సి వస్తోందని కూలీలు ఆవేదన చెందుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 52వేల మంది కూలీలు పనికి దూరమయ్యారు.

- మోత్కూరు

ఉపాధికి దూరం చేసిన ఆధార్

ఉపాధి హామీ పనులు 2021 డిసెంబరు వరకు ప్రభుత్వ ఆధీనంలోని 'రాగా' సాఫ్ట్‌వేర్ పర్యవేక్షణలో సాగాయి. ఈ సాఫ్ట్‌వేర్‌తో కేంద్రం నుంచి విడుదలైన ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించి ఇతర పనులకు వినియోగిస్తోంద ని కేంద్ర ప్రభుత్వం భావించింది. క్షేత్రస్థాయిలో పనులు జరగకున్నా ఉద్యోగులు తప్పుడు రికార్డులు నమోదు చేసి కూలీల పేరుతో డబ్బు స్వాహా చేసిన ఘటనలు కొన్ని చోట్ల సామాజిక తనిఖీల్లో వెలుగులోకి వచ్చాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం 2022 ఫిబ్రవరి నుంచి 'రాగా'కు బదులు నేషనల్ ఇన్‌ఫర్మేటిక్ సెంటర్ (ఎన్‌ఐసీ) సాఫ్ట్‌వేర్ తెచ్చి ఉపాధి పనుల అజమాయిషీని పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకుంది. కూలీలు ఎలాంటి పనులు చేయాలన్నా తొలుత పనిచేస్తున్న ప్రాంతాన్ని,కూలీల హాజరు,చేసిన పనుల కొలతలను సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసి నేరుగా ఎన్‌ఐసీకి పంపేలా పర్యవేక్షణ పెంచారు.

బ్యాంకు లేదా పోస్టాఫీస్ ద్వారానే చెల్లింపులు

అక్రమాలకు ఆస్కారం లేకుండా కూలీలకు ప్రతీవారం చెల్లించాల్సిన కూలి (వేతనం) బ్యాంకు లేదా పోస్టాఫీసు ద్వారా ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. అందుకు కూలీల ఆధార్ నంబర్, బ్యాంకు లేదా పోస్టాఫీస్ ఖాతా నంబర్, జాబ్‌కార్డుకు అనుసంధా నం చేయాలని గ్రామీణాభివృద్ధి సంస్థలను ఆదేశించింది. తొలుత గత ఏడాది ఆగస్టు నెల వరకు గడువు విధించి, ఆ తరువాత గత డిసెంబరు 31 వరకు పొడిగించింది. అయినా ఆధార్ అప్‌డేట్ కాకపోవడం, జాబ్‌కార్డులో, ఆధార్ ఇంటి పేర్లు సరిపోలక పోవడం, వేలి ముద్రలు నమోదుకాకపోవడం, కొత్తగా పెళ్లయిన వారికి వధువు ఆధార్‌కార్డు ఆమె తల్లిదండ్రుల రేషన్‌కార్డుకు లింకై ఉండటం తదితర కారణాలతో కొందరు కూలీల ఆధార్ అనుసంధానం పూర్తి కాలేదు. దీంతో ఆధార్ అనుసంధానం కాని కూలీలను ఉపాధి సిబ్బంది పనికి రానివ్వడం లేదు.

గ్రూపులు లేకపోవడంతో...

గతంలో పని చేస్తున్న కూలీలను 20మందికి ఒక గ్రూపుగా విభజించి పని చేయించేవారు. ఒక్కో గ్రూ పునకు ఒక మస్టర్ ఉండేది. ఇప్పుడు ఒక చోట ఎం తమంది (100-150మంది) పనిచేసినా ఒకే గ్రూపు గా పరిగణించి, ఒకే మస్టర్ రాస్తున్నారు. అక్కడ పని చేసే కూలీల్లో ఒక్కరి ఆధార్ అనుసంధానం కాకపోయినా మిగతా కూలీలందరి వేతనం నిలిచిపోతుంది. ఈ కారణంగా ఆధార్ అనుసంధానం చేయని కూలీలను పనిలోకి రానివ్వడం లేదు.

ప్రోత్సాహకాలు రద్దు

ఉపాధి హామీ పనులు రాష్ట్ర ప్రభుత్వం ఆధీనం లో నడిచినప్పుడు వేసవిలో పని కష్టమని ఫిబ్రవరి, మార్చి నెలల్లో 20శాతం, ఏప్రిల్, మే నెలల్లో 30శాతం, జూన్‌లో 20శాతం అదనంగా కూలి ఇచ్చేవారు. లీటర్ నీటికి రూ.2చొప్పున రోజుకు ఐదు లీటర్ల తాగునీటికి రూ.10, గడ్డపార మొన పెట్టించేందుకు రూ.10, మేట్లకు రూ.20 అలవెన్సుగా ఇచ్చేవారు. నీడ కోసం టెంట్లు వేసేవారు. ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకుని అవన్నీ రద్దుచేసింది. ప్రభుత్వం నిర్దేశించిన లెక్కల ప్రకారం పని చేస్తే కూలీకి ప్రతి రోజు రూ.272 ప్రభుత్వం చెల్లిస్తుంది. గతంలో యాదాద్రి జిల్లాలో సగటు కూలి రూ.110 కాగా, ఇప్పుడు సగటు కూలి రూ.180గా ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు.

నీడలేదు, నీళ్లు లేవు



పనిచేసే చోట గతంలో నీడ కోసం టెంట్లు వేసేవారు. ఇప్పుడు టెంట్లు వేయడం లేదు. ఎండలో పని చేసి అలిసిపోతే కొంత సేపు సేదదీరుదామంటే నీడ ఉండటం లేదు. చెట్లు లేని చోట నీడ లేక ఎండలోనే కూర్చోవల్సి వస్తోంది. గతంలో తాగునీటికి రోజుకు రూ.10చొప్పున ఇచ్చేవారు. ఇప్పుడు ఇవ్వడం లేదు. ఫిల్టర్‌నీళ్లు మాడబ్బుతోనే కొనుగోలుచేసి తాగుతున్నాం. గతంలో మాదిరిగా తాగునీటికి డబ్బు ఇవ్వాలి.

- చంద్రమ్మ, ఉపాధి కూలీ, ముశిపట్ల

పేస్లిప్‌లు ఇవ్వడం లేదు



గతంలో పేసిప్ ఇచ్చేవారు. వాటితో ఏ రోజు ఎంత కూలి వచ్చిందనేది తెలిసేది. ఇప్పుడు పేస్లిప్ ఇవ్వడం లేదు. రెండు, మూడు వారాలకు కలిపి కూలి మొత్తం ఒకే సారి ఖాతాలో వేస్తుండటంతో ఏ రోజు ఎంత కూలి పడిందన్నది తెలియడం లేదు. గడ్డపార మొన పెట్టించడానికి డబ్బు ఇవ్వకపోవడంతో వచ్చే కూలి నుంచే రోజుకు రూ.10నుంచి రూ.15 గడ్డపార మొన పెట్టించేందుకే ఖర్చవుతోంది. పేస్లిప్‌లు ఇవ్వడంతో పాటు గడ్డపార మొన పెట్టించడానికి గతంలా డబ్బు ఇవ్వాలి. వేసవిలో భూమి గట్టిగా ఉండి తవ్వకం పనులు ఎక్కువ జరగవు. కాబట్టి వేసవిలో అదనపు కూలి ఇవ్వాలి.

- బుషిపాక హనుమయ్య, కూలీ, ముశిపట్ల

ఉమ్మడి జిల్లాలో 52,405 మంది దూరం

వివిధ కారణాలతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధానం కాక 52,405 మంది పనికి దూరమయ్యారు. నల్లగొండ జిల్లాలో 7,61,615 మంది కూలీలు, సూర్యాపేట జిల్లాలో 5,74,401 మంది, యాదాద్రి జిల్లాలో 2,60,913 మంది కూలీలు ఉన్నారు. సాంకేతిక, ఇతర కారణాలతో నల్లగొండ జిల్లాలో 25,299 మంది, సూర్యాపేట జిల్లాలో 19,226 మంది, యాదాద్రి జిల్లాలో 7,880 మంది కూలీల జాబ్‌కార్డులకు ఆధార్ కార్డులు అనుసంధానం జరగక పనులకు దూరమయ్యారు. వ్యవసాయ పనులు ముగిసినందున ప్రస్తుతం కూలీలకు ఉపాధి హామీ (కరువు)పనులే ఆదాయ వనరు. ఆధార్ అనుసంధానం జరగక పనిలోకి రానివ్వకపోవడంతో తాము ఉపాధి కోల్పోయామని కూలీలు ఆవేదన చెందుతున్నారు. ఇదిలా ఉండగా, ఇది నిరంతర ప్రక్రియ అని, ఆధార్ అప్‌డేట్ చేయించుకుని జాబ్‌కార్డుకు లింక్ చేయించుకున్నట్టయితే వెంటనే పనిలోకి తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.

సోమ్లాల్‌నాయక్ కృషి ఆదర్శనీయం

కలెక్టర్ హనుమంతు కే.జెండగే



పద్మశ్రీ అవార్డు గ్రహీత సోమ్లాల్‌నాయక్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే, చిత్రంలో డీసీపీ రాజేష్‌చంద్ర, తదితరులు

భువనగిరి రూరల్, ఫిబ్రవరి 11: గిరిజన తండాలో జన్మించిన సోమ్లాల్ నాయక్ కృషి ఆదర్శనీయమని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. మండలంలోని ఆకుతోటబావి తండాకు చెందిన కేతావత్ సోమ్లాల్‌నాయక్‌కు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ ప్రకటించడంతో ఆదివారం తండావాసుల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించిన సోమ్లాల్ నాయక్ ధృఢ సంకల్పంతో 700 శ్లోకాలు రాసి భగవద్గీతను బంజారా భాషలోకి అనువదించారని చెప్పారు. ఆ గ్రంథాన్ని టీటీడీకి బహూకరించడం రాష్ట్రంలోని గిరిజనులకు దక్కిన గొప్ప గౌరవమని, పట్టుదలతో కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చన్నారు. డీసీపీ రాజేష్‌చంద్ర మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని పురస్కారాలు పొంది ఈ ప్రాంతానికి పేరు తీసుకురావాలన్నారు. అవార్డు గ్రహీత సోమ్లాల్ నాయక్ మాట్లాడుతూ తాను చిన్నప్పటినుంచే బంజారా భాషలో శ్లోకాలు, పాటలు రాసేవాడినని, తన కృషికి పద్మశ్రీ దక్కడం ఆనందంగా ఉందన్నారు. సోమ్లాల్ నాయక్‌ను కలెక్టర్, డీసీపీ, గిరిజన సంఘాల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాస్వి మెగావత్ భిక్షునాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్రనేత దేవసోతు టీకం నాయక్, కేతావత్ తిరుపతి, తేజావత్ కుమార్, రావి సేవా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు చెరుకుపల్లి శ్రీనివాస్, పడాల భాస్కర్, మాలూనాయక్, హన్మంత్ నాయక్, పాత్యానాయక్, కృష్ణ, కార్తీక్ పాల్గొన్నారు.

ఖోఖో మహిళల విజేత మనోళ్లే



ఖోఖో మహిళా విజేత ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

రాష్ట్రస్థాయి 56వ సీనియర్స్ ఖోఖో మహిళా విజేతగా ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టు నిలవగా, పురుషుల విజేతగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నిలిచింది. మూడు రోజులుగా జిల్లాకేంద్రంలో కొనసాగుతున్న ఖోఖో ఛాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి.

•6లో..



యాదగిరిగుట్టలో భక్తుల సందడి

•6లో..

ఫలించిన పోరాటం

- 625 రోజుల తర్వాత కొండపైకి ఆటోలు
- హామీ నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- జెండా ఊపి ఆటోలను పంపిన ప్రభుత్వ విప్
- మొదటి ఘాట్‌రోడ్ గుండా అనుమతి
- 300 కుటుంబాలకు ఉపాధి అవకాశం
- రెండు షిఫ్టుల్లో రోజుకు కొండపైకి 100 ఆటోలు



మొదటి ఘట్‌రోడ్ గుండా వెళ్తున్న ఆటో

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి11: యాదగిరికొండపైకి ఆటోలను ప్రభుత్వం అనుమతించడంతో ఆటో కార్మికుల ఆనందానికి అవధుల్లేక ఆనంద డోలికల్లో నిండిపోయారు. యాదగిరిక్షేత్రానికి విచ్చేసే భక్తులను కొండపైకి, కొండకిందకు చేరవేస్తూ గత 30 ఏళ్లుగా జీవనం సాగిస్తున్నారు. అయితే ఆలయ ఉద్ఘాటనకు ముందస్తుగా అప్పటి ప్రభుత్వం, దేవస్థాన అధికారుల ఆకస్మిక నిర్ణయం కారణంగా 2022 ఫిబ్రవరి 22వ తేదీ నుంచి కొండపైకి ఆటోలను నిషేధించారు. దీంతో అప్పటి నుంచి ఆటో కార్మికులు కలవని అధికారులు, ప్రజాప్రతినిధులు, మంత్రులు లేరు. అప్పటి దేవస్థాన ఈవో గీతారెడ్డికి, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిలతో పలువురు అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో తులసీకాటేజ్ వద్ద దీక్షకు దిగారు. సుమారు 625 రోజులపాటు దీక్షలు చేసినా ఏ అధికారి, మంత్రి కనికరించలేదని, ఎన్నో ఏళ్లుగా ఆటోలనే నమ్ముకుని జీవనం సాగిస్తూ, తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని పలు విధాలుగా సమస్య ప్రభుత్వానికి తెలియజేసే విధంగా నిరసనలు, ధర్నాలు, ర్యాలీలు చేసినా ఫలితం కనిపించకపోవడంతో ఆటో కార్మికులు నిరాశచెందారు. అయినా తమ ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా ఆటోలను కొండపైకి అనుమతించాలని కోరుతూ పలు విధాలుగా నిరసనలు తెలుపుతూనే వినతులు సమర్పించారు.

ఎన్నికల ప్రచారంలో ఇరు పార్టీల హామీ

రాష్ట్రంలో గతేడాది అక్టోబరులో ఎన్నికల కోడ్ రావడంతో తమ ప్రచారాల్లో భాగంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు ఆటో కార్మికులకు ప్రభుత్వం ఏర్పాటు అనంతరం సమస్యను పరిష్కరిస్తామని హామీలు ఇచ్చాయి. ఆటో కార్మికులు ఎన్నికల కోడ్ కారణంగా ప్రభుత్వానికి సహకరిస్తామని పేర్కొంటూ దీక్షలకోసం వేసుకున్న టెంట్‌ను ఎత్తివేశారు. తమ సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆటో కార్మికులు కోరుతూనే ఉన్నారు. కాగా ఎన్నికల ప్రచార సమయంలో అప్పటి ఐటీ మంత్రి కేటీఆర్ గుట్టలో రోడ్‌షో నిర్వహించిన సమయంలో తమ బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాగానే ఆటోలను కొండపైకి అనుమతిస్తామని వెల్లడించారు.

300 కుటుంబాలకు ఉపాధి అవకాశం

ఆటోలను కొండపైకి అనుమతించడంతో సుమారు 300 కుటుంబాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా మరో 500 కుటుంబాలకు ఉపాధి లభించినట్లయింది. అయితే రోజుకు షిఫ్టులవారీగా 100 ఆ టోలను మాత్రమే అనుమతించనున్నారు. ఉదయం 3గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మొదటి షిఫ్టు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 11గంటల వరకు రెండో షిఫ్టు కొనసాగనుంది. ఆటోలో డ్రైవర్‌తోపాటు ముగ్గురు ప్రయాణికులు, ఒక్కో ప్రయాణికుడి వద్దనుంచి రూ.25 మాత్రమే చార్జీల రూపంలో ఆటో కార్మికులు వసూలు చేయాలని, ఒక్కో షిఫ్టులో 50 ఆటోలు, కొండపైన 25, కొండకింద 25 ఆటోలు నిలిపే విధంగా విధివిధానాలు రూపొందించిన అధికారులు నిరంతరం నిఘాను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి రాగానే స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖల దృష్టికి ఆటో కార్మికుల సమస్యను తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. కొండపైకి ఆటోలను నడిపేందుకు విధివిధానాలను రూపొందించాలని సూచించారు. దీంతో అయిలయ్య ఇటు దేవస్థాన, రెవెన్యూ, పోలీసు అధికారులు, అటు ఆటో కార్మికులతో పలుమార్లు సమీక్షలు నిర్వహించి కొండపైకి ఆటోలను అనుమతించేందుకు మార్గం సుగమం చేసేందుకు తనవంతు సహకారం అందించారు. విధివిధానాలు రూపొందించిన అధికారులు మొదటి ఘాట్‌రోడ్ గుండా ఆటోలను కొండపైకి అనుమతించేందుకు ప్రణాళికలు సిద్ధంచేశారు. దాదాపు రెండేళ్ల పోరాట ఫలితం కొండపైకి ఆటోలను అనుమతించేందుకు అంతా సిద్ధం కాగా బీర్ల ఐలయ్య, కలెక్టర్ హనుమంతు కే.జెండగే, దేవస్థాన ఈవో రామకృష్ణారావు, డీసీపీ రాజేష్‌చంద్రలతోపాటు పలువురు ప్రముఖులు పచ్చ జెండా ఊపి కొండపైకి ఆటోలను అనమతించడంతో ఆటో కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.



గుట్టపైకి ఆటోలో వెళ్తున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

30 ఏళ్లుగా ఆటోలు నడుపుతున్నాం

గత 30 ఏళ్లుగా కొండపైకి ఆటోలను నడుపుతూ జీవనం సాగిస్తున్నాం. గత ప్రభుత్వంలో అధికారులు మాపై వివక్ష చూపించారు. ఎంత వేడుకున్నా కనీసం కనికరం చూపలేదు. రెండేళ్లు ఆటోలు నడవక.. ఆటో ఫైనాన్స్‌లు చెల్లించలేక, కటుంబపోషణ భారంగా మారింది. అధికారుల సూచనల మేరకు ఆటోలు నడుపుతాం.

- కొమ్మగాని సత్యం, ఆటో కార్మికుడు

ఆటో కార్మికుల కోరిక నెరవేర్చాం : ప్రభుత్వ విప్ అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్: గత ప్రభుత్వ హయాంలో రెండేళ్ల పాటు ఇబ్బందులు ఎదుర్కొన్న ఆటో కార్మికుల కోరికను కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నెరవేర్చామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. ఆదివారం గుట్టపైకి ఆటోలను జెండా ఊపి ప్రారంభించారు. స్వయంగా కొద్ది దూరం ఆటో నడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సుమారు 300మంది ఆటో కార్మికుల పొట్టకొట్టిందన్నారు. కాంగ్రెస్ గెలిచిన రెండు నెలల్లోనే ఆటో కార్మికుల కోరిక నెరవేర్చామన్నారు. కార్మికులు నిబంధనలు పాటిస్తూ ఆటోలు నడపాలని కోరారు. అదేవిధంగా గుట్టపైన భక్తుల సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. వైటీడీఏ పేరుతో జిల్లా మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, కల్వకుంట్ల కవిత, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత నిధులను దోచుకొన్నారని ఆరోపించారు. దేవుడి సొమ్ము దండుకున్న వారితోపాటు ఈఎస్సీ గణపతిరెడ్డి, కొంతమంది అధికారులు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. యాదగిరిగుట్ట నుంచి మెడికల్ కళాశాల తరలింపు అవాస్తమని, వచ్చే జూలై మాసంలో ఇక్కడ విద్యార్థులకు తరగతులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ హనుమంతు కె.జెండగే, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డీసీపీ రాజేష్‌చంద్రా, ఏసీపీ శివరాంరెడ్డి, ఆలయ ఈవో రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అన్నం సంజీవరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాగౌడ్, ఎంపీపీ చీర శ్రీశైలం, కౌన్సిలర్ ముక్కర్ల మల్లేశ్, సీస విజయలక్ష్మి, మాజీ వైస్ ఎంపీపీ శివరాత్రి దానయ్య, నాయకులు గుండ్లపల్లి భరత్‌గౌడ్, దుంబాల వెంకట్‌రెడ్డి, భిక్షపతిగౌడ్, వరలక్ష్మి, జ్యోతి, శ్రీవల్లి పాల్గొన్నారు.


ఉమ్మడి జిల్లాలో 55మంది ఎంపీడీవోల బదిలీ


● పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో స్థాన చలనం

నల్లగొండ, భువనగిరి రూరల్, ఫిబ్రవరి 11: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భారీగా ఎంపీడీవోలను బదిలీ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన ఎంపీడీవోలు ఈనెల 13లోగా వారికి కేటాయించిన మండలాల్లో బాధ్యతలు తీసుకోవాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 55మంది ఎంపీడీవోలకు స్థాన చలనం కలిగింది. నల్లగొండ జిల్లాలో 28మందిని, యాదాద్రి జిల్లాలో 14మంది, సూర్యాపేట జిల్లాలో 13మంది ఎంపీడీవోలు బదిలీ అయ్యారు.

ఎంపీడీవో	బదిలీ జిల్లా
నల్లగొండ జిల్లాలో..	
బి.యాకుబ్	యాదాద్రి
కే.రమేష్‌దీన్‌దయాళ్	సూర్యాపేట
పి.జాన్సీలక్ష్మిబాయి	యాదాద్రి
బి.లాజర్	సూర్యాపేట
పీవీఎస్‌ఆర్‌కే శర్మ	సిద్దిపేట
డి.జితేందర్‌రెడ్డి	యాదాద్రి
ఖాజా అజ్‌ఘర్ ఆలీ	సూర్యాపేట
కె.శేషుకుమార్	సూర్యాపేట
జి.లక్ష్మి	సూర్యాపేట
పి.సునీత	సూర్యాపేట
జె.రాములునాయక్	జోగులాంబగద్వాల్
కె.గిరిబాబు	సూర్యాపేట
కె.ప్రమోద్‌కుమార్	యాదాద్రి
ఎ.దేవిక	యాదాద్రి
జె.వెంకటేశ్వర్‌రావు	సూర్యాపేట
జి.బాలకృష్ణ	సూర్యాపేట
వై.శ్రీనివాస్‌రెడ్డి	యాదాద్రి
డి.సోమసుందర్‌రెడ్డి	సూర్యాపేట
వై.హరికృష్ణ	జోగులాంబగద్వాల్
పి.మహేందర్‌రెడ్డి	సంగారెడ్డి
ఎంఎం.షరీఫ్	సంగారెడ్డి
ఎల్.రాజు	ఖమ్మం
ఎస్.సుధాకర్	సంగారెడ్డి
జి.యాదగిరి	సంగారెడ్డి
ఆర్.భాస్కర్	యాదాద్రి
సూర్యాపేట జిల్లాలో..	
ఆర్.సరోజ	నల్లగొండ
ఎం.ఎర్రయ్య	ఖమ్మం
ఎండీ.ఇసాక్‌హుస్సేన్	నాగర్‌కర్నూల్
బీ.శ్రీనివాసరావు	నల్లగొండ
పి.శంకరయ్య	యాదాద్రి
కె.ఉమేష్‌చారి	నల్లగొండ
ఎం. ఇందిర	యాదాద్రి
ఎల్.మల్‌సూర్	సంగారెడ్డి
ఎ.జానయ్య	నారాయణపేట్
కె.ఇద్దయ్య	భద్రాద్రికొత్తగూడెం
ఎల్.లక్ష్మి	నల్లగొండ
బి.వెంకటేశ్వర్లు	ఖమ్మం
టి.వెంకటాచారి	వనపర్తి
యాదాద్రి జిల్లాలో..	
పి.జ్ఞానప్రకాష్‌రావు	నల్లగొండ
ఈ.వీరస్వామి	మహబూబాబాద్
ఎల్.చంద్రమౌళి	నల్లగొండ
లెంకల గీతారెడ్డి	మేడ్చల్‌మల్కాజ్‌గిరి
కె.ప్రభాకర్‌రెడ్డి	వికారాబాద్
ఎ.రాములు	జనగాం
యు.శ్రీవాణి	రంగారెడ్డి
ఎ.బాలశంకర్	రంగారెడ్డి
బి.సరిత	రంగారెడ్డి
జి.జలేందర్‌రెడ్డి	జనగాం
ఉమాదేవి	జనగాం
బి.యాదగిరి	సిద్దిపేట
జి.శ్రీనివాసులు	జనగాం
జి.నరేందర్‌రెడ్డి	రంగారెడ్డి








యాదగిరిగుట్టలో భక్తుల సందడి

● నిత్య ఆదాయం రూ.53.48లక్షలు


నిత్య తిరుకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 11: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. మేడారం జాతరకు వెళ్లిన భక్తులు తిరుగు ప్రయాణంలో యాదగిరీశుడిని దర్శించుకోవడం ఆనవాయితీ. సుముహూర్తాలు ఆరంభమవగా, క్షేత్రాన్ని సందర్శించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ప్రధానాలయం, తిరువీధులు, సేవామండపాలు సందడిగా కన్పించాయి. ధర్మదర్శనాల్లో మూడు గంటలు, ప్రత్యేక దర్శనాలకు గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. సుమారు 45వేల మందికి పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని దేవస్థాన అధికారులు తెలిపారు. స్వామికి నిత్య విధి కైంకర్యాలు ఆగమ శాస్త్రరీతిలో, శివాలయంలో రామలింగేశ్వరుడికి స్మార్త సంప్రదాయరీతిలో నిత్యారాధనలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాతంతో స్వయంభువులను మేల్కొలిపిన ఆచార్యులు బిందెతీర్థంతో నిత్య పూజలు ఆరంభించి రాత్రి వేళ మహానివేదన, శయనోత్సవంతో ఆలయ ద్వార బంధనం చేశారు. స్వామి వారికి అమెరికాకు చెందిన చెరుకూరి శైలేంద్ర, రాధిక దంపతులు సుమారు 990గ్రాముల బరువు ఉన్న రెండు వెండి కలశాలను కానుకగా అందజేశారు. క్షేత్ర సందర్శనకు వచ్చిన భక్తులకు హైదరాబాద్ ఏఎస్.రావ్‌నగర్‌కు చెందిన ఎస్.ల్యాబ్స్, క్రిష్‌మెడ్స్ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భక్తులు పరీక్షలు చేయించుకున్నారు. కాగా, వివిధ విభాగాల ద్వారా స్వామివారి ఖజానాకు రూ.53,48,668 ఆదాయం సమకూరినట్లు దేవస్థాన ఈవో రామకృష్ణారావు తెలిపారు.







ఖోఖో మహిళల విజేత

ఉమ్మడి నల్లగొండ జట్టు

● ముగిసిన 56వ తెలంగాణ సీనియర్స్ ఖోఖో ఛాంపియన్ షిప్ పోటీలు


ఫైనల్స్‌లో పోటీ పడుతున్న నల్లగొండ, రంగారెడ్డి జట్లు

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 11: తెలంగాణ 56వ సీనియర్స్ ఖోఖో మహిళా విజేతగా ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టు నిలవగా, పురుషుల విజేతగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నిలిచింది. ఈ మేరకు మూడు రోజులుగా యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలో కొనసాగుతున్న 56వ తెలంగాణ సీనియర్స్ ఖోఖో ఛాంపియన్ షిప్ 2023-24 పోటీలు ఆదివారం ముగిశాయి. ఉత్కంఠ భరితంగా సాగిన ఫైనల్స్‌లో నల్లగొండ జట్టు రంగారెడ్డి జిల్లాపై 9-7పాయింట్ల తేడాతో విజయం సాధించింది. మహబూబ్‌నగర్ జట్టు తృతీయ, హైదరాబాద్ జట్టు చతుర్థ స్థానంలో నిలిచాయి. పురుషుల ఫైనల్స్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా రంగారెడ్డి జిల్లాపై 22-21 పాయింట్ల తేడాతో గెలుపొంది విజేతగా నిలిచింది. తృతీయ, చతుర్థ స్థానంకోసం జరిగిన పోటీలో వరంగల్, హైదరాబాద్ జట్ల మ్యాచ్ టై కావడంతో ఆ రెండు జట్లను తృతీయ స్థానాన్ని సమష్టిగా పంచుకున్నాయి. నల్లగొండ పురుషుల జట్టు 9వ స్థానంలో నిలిచింది. మహిళా జట్టు విజేతకు యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, పురుషుల జట్టు విజేతకు అదనపు కలెక్టర్ వీరారెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో క్రీడా సౌకర్యాలను మెరుగుపర్చే లక్ష్యంతో పట్టణ శివారులోని రాయిగిరిలో 10ఎకరాల విస్తీర్ణంలో రూ.100కోట్లతో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించనున్నట్లు తెలిపారు.

ముగిసిన ఛాంపియన్ షిప్ పోటీలు

56వ తెలంగాణ సీనియర్స్ ఖోఖో చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. మూడు రోజులపాటు జరిగిన పోటీల్లో 10 ఉమ్మడి జిల్లాలకు చెందిన 20 మహిళల, పురుషుల జట్లకు చెందిన 300 మంది క్రీడాకారులు 48 మ్యాచ్‌లు ఆడారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి కె ధనంజనేయులు, ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీనాథ్, టోర్నీ చైర్మన్ ఏదునూరి మల్లేశం, ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్, డీఏవో మందడి ఉపేందర్‌రెడ్డి, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు జలేందర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి డాక్టర్ స్టాలిన్ బాబు, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కోనేటి గోపాల్ ఉన్నారు.

టోర్నీలో జట్ల స్థానాలు ఇలా..

మహిళల జట్టు:నల్లగొండ(1వ), రంగారెడ్డి(2వ), మహబూబ్‌నగర్ (3వ), హైదరాబాద్ (4వ), ఆదిలాబాద్ (5వ), కరీంనగర్ (6వ), మెదక్ (7వ), వరంగల్ (8వ), ఖమ్మం (9వ), నిజామాబాద్ (10వ) స్థానంలో నిలిచాయి.

పురుషుల జట్టు : కరీంనగర్ (1వ), రంగారెడ్డి (2వ), వరంగల్, హైదరాబాద్ (సంయుక్తంగా 3వ), మెదక్ (5వ), ఖమ్మం (6వ), మహబూబ్‌నగర్ (7వ), ఆదిలాబాద్ (8వ), నల్లగొండ (9వ), నిజామాబాద్ (10వ) స్థానంలో నిలిచాయి.


కరీంనగర్ పురుషుల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి



చాక్లెట్లు ఆశ చూపి చిన్నారికి బెదిరింపులు

నేరేడుచర్ల, ఫిబ్రవరి 11: సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలోని చింతబండ వద్ద శనివారం సాయంత్రం ఓ చిన్నారికి చాక్లెట్లు ఆశచూపి బెదిరించారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. చింతబండ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న చిన్నారి సాయంత్రం 4గంటల తర్వాత పాఠశాల నుంచి ఇంటికి వెళుతుండగా ఓ అగంతకుడు ద్విచక్ర వాహనంపై వచ్చి చాక్లెట్ ఇస్తా అని చెప్పడంతో చిన్నారి తీసుకోకుండా మొండికేసింది. ఎందుకు తీసుకోవు అంటూ బెదిరిస్తుండడంతో చిన్నారికి భయం వేసి రహదారి పక్కన ఉన్న ఇంట్లోకి పరిగెత్తింది. ఆ ఇంట్లో ఉన్న వారికి విషయం చెప్పడంతో వారు బయటకు వచ్చే సరికి అగంతకుడు ఉడాయించాడు. బైక్‌పై వచ్చిన వ్యక్తి టీషర్ట్ ధరించి, నిక్కరు వేసుకొని ఉన్నాడని చిన్నారి తెలిపింది. పోలీస్‌స్టేషన్‌కు అతి సమీపంలో జరిగిన ఈ ఘటనతో అంతా ఉలిక్కిపడ్డారు. చిన్నారుల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని స్థానికులు తెలిపారు. పై విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రవీందర్ తెలిపారు.

కన్నుల పండువగా ఆంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠ



ఆంజనేయస్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ అనంతరం మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ కల్చరల్, ఫిబ్రవరి 11: జై శ్రీరామ్.. జై హనుమాన్ భక్తుల నినాదాలు.. హర్షధ్వానాల నడుమ 18అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం కన్నుల పండువగా సాగింది. జిల్లా కేంద్రంలోని పాత బస్తీ హనుమాన్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన అంజనేయస్వామి ఆలయం ప్రారంభం, స్వామివారి ఏకశిల విగ్రహ ప్రతిష్ఠ చూడముచ్చటగా సాగింది. ఉదయం రుత్వికుల వేదమంత్రోచ్ఛారణ, మంగళ వాయిద్యాల నడుమ వేద పండితులు యంత్ర ప్రతిష్ఠ చేశారు. అనంతరం స్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భక్తులు, జిల్లా అధికారులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ప్రతిష్ఠా మహోత్సవాన్ని కనులారా తిలకించి పరవశులయ్యారు. అనంతరం అర్చక స్వాములు సువర్చల సమేత అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ హరిచందన, అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు బైరు రాజయ్య, వీరెల్లి చంద్రశేఖర్, బండారు ప్రసాద్, గుండెబోయిన వెంకటేశ్వర్లు యాదవ్, సతీష్, గార్లపాటి వెంకటయ్య, కంది సూర్యనారాయణ, రాంరెడ్డి, యాదగిరి, అభిమన్యు శ్రీనివాస్, ఎడ్ల శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, చాడా కిషన్‌రెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హాజరైన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హిందువుల ఆకాంక్ష నెరవేరింది : కిషన్‌రెడ్డి

పలు పోరాటాల అనంతరం ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠతో హిందువుల ఆకాంక్ష నేరవేరందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం పాతబస్తీ హనుమాన్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన అంజనేయ స్వామి ఆలయం, స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్టమొదటి ఏకశిల విగ్రహాన్ని ప్రతిష్ఠించుకోవడం సంతోషంగా ఉందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు అంజనేయస్వామి దేవాలయం ఒక పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాజయ్య, బండారు ప్రసాద్, వీరెల్లి చంద్రశేఖర్, డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, గుండబోయిన వెంకటేశ్వర్లుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.25లక్షలు : వెంకట్‌రెడ్డి

విగ్రహదాతగా ఉండటం తన అదృష్టమని, ఆలయ అభివృద్ధికి మరో రూ.25లక్షలు కేటాయిస్తున్నట్టు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. హనుమాన్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. కలెక్టర్ హరిచందనతో కలిసి పూజల్లో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆలయానికి వచ్చేభక్తులకు ఇబ్బంది కలగకుండా ఘాట్ రోడ్ నిర్మాణం, గాలిగోపురం ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో రవి, గుమ్మల మోహన్ రెడ్డి, అబ్బగోని రమేష్, తదితరులు పాల్గొన్నారు.



సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీస్తున్న భక్తులు



స్వామివారికి మొక్కుతున్న భక్తులు





స్వామివారికి మొక్కుతున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి, వేడుకల్లో పాల్గొన్న భక్తులు

వారం రోజుల్లో వివాహం..

అంతలోనే విషాదం

శుభలేఖలు పంచి వస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి



శివకుమార్ (ఫైల్)

నార్కట్‌పల్లి, మోత్కూరు, ఫిబ్రవరి 11: వారం రోజుల్లో పెళ్లిపీటలు ఎక్కాల్సిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పెళ్లి బాజాలు మోగాల్సిన ఇంట్లో చావు డప్పు మోగింది. శనివారం రాత్రి నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో ఈ సంఘటన జరిగింది. నార్కట్‌పల్లి ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరుకు చెందిన సకినాల వెంకటయ్య, ఉమారాణి దంపతులకు రైస్‌మిల్లు, కిరాణా దుకాణం ఉన్నాయి. ముగ్గురు కుమారులు కాగా, ఇద్దరికి వివాహాలు అయ్యాయి. వెంకటయ్య కిరాణా దుకాణం నిర్వహిస్తుండగా, కుమారులు రైస్ మిల్ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు. మూడో కుమారుడు శివకుమార్(26)కు హైదరాబాద్‌కు చెందిన అమ్మాయితో ఈ నెల 18వ తేదీన వివాహం నిశ్చయమైంది. కుటుంబ సభ్యులు పెళ్లి పనుల్లో హడావుడిగా ఉన్నారు. వరుసకు సోదరుడైన అప్పిశెట్టి నితిన్‌కుమార్‌తో కలిసి శివకుమార్ పెళ్లి పత్రికలను పంచుతున్నాడు. శనివారం నల్లగొండలో ఉంటున్న బంధువులకు పత్రికలు పంచి ద్విచక్ర వాహనంపై తిరిగి మోత్కూరు కు బయలుదేదారు. రాత్రి 11 గంటల సమయంలో నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు గ్రామశివారుకు చేరుకోగానే ప్రమాదవశాత్తు బైకు అదుపు తప్పి రోడ్డుపై పడింది. దీంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న శివకుమార్ తలకు బలమైన గాయాలుకాగా, వెనుక కూర్చున్న నితిన్ స్వల్పంగా గాయపడ్డాడు. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని శివకుమార్‌కు ప్రాథమిక చికిత్స అందించి నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే శివకుమార్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని నల్లగొండ జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించినట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు. శివ సోదరుడు సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు.

మోత్కూరులో విషాదఛాయలు

మోత్కూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. కిరాణ వ్యాపారులు దుకాణాలు మూసి వేసి సంతాపం తెలిపారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తాలో శివకుమార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ అధ్యక్షుడు ఇరుకుల వెంకన్న, మొగుళ్లపల్లి సోమయ్య, బుక్క విశ్వనాథం, బుస్సా శ్రీనివాస్, సోమ వెంకటేశ్వర్లు, తిపిరిశెట్టి శ్రీనివాస్, బుస్సా రవి పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

ఆస్తి పంచాయితీలో దుర్భాషలాడిన తండ్రి

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీస్‌స్టేషన్ ఎదుట ఘటన



విలేకరులతో మాట్లాడుతున్న బాధితురాలు విజయ

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 11: పుట్టింటి వారు పసుపు కుంకుమల కింద ఇచ్చిన ఇంటి స్థలం కోసం ఓ మహిళ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నం చేసింది. ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద ఈ సంఘటన జరిగింది. బాధిత మహిళ, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మిర్యాలగూడ మండలంలోని జప్తివీరప్పగూడెం గ్రామానికి చెందిన కదారి రామనర్సయ్యకు ఇద్దరు భార్యలు ఉన్నారు. 11 సంవత్సరాల క్రితం మొదటి భార్య కుమార్తె విజయకు వివాహం సమయంలో పసుపుకుంకుమల కింద గ్రామంలో ఉన్న ఇంటిని అప్పగించాడు. అయితే తనకు గిఫ్ట్‌గా ఇచ్చిన ఇంటిని తండ్రి రామనర్సయ్య ఇతరులకు విక్రయించేందుకు ప్రయత్నించాడు. విషయం తెలుసుకున్న కుమార్తె విజయ దీనిని అడ్డుకుని న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించింది. అక్కడ న్యాయం జరగకపోవడంతో గతంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు గ్రామ పెద్ద మనుషులను ఆశ్రయించింది. ఎక్కడా తనకు న్యాయం జరగలేదని బాధితురాలు విజయ తెలిపింది. అయితే గత నెల 28వ తేదీన తన ఇంటి విక్రయంలో తన కుమార్తె విజయ అడ్డుపడుతుందని తండ్రి రామనర్సయ్య మిర్యాలగూడ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారించేందుకు రూరల్ పోలీసులు విజయను ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ తీర్మానం చేసుకోవాలని పోలీసులు సూచించారు. దీంతో ఇరువర్గాలకు చెందిన పెద్ద మనుషులు పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న పాత వ్యవసాయ మార్కెట్ షెడ్‌లో పంచాయితీ నిర్వహించారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరగగా విజయ తన తండ్రిని ఆస్తి విషయమై నిలదీసింది. మనస్తాపం చెందిన విజయ బ్లేడ్‌తో చేతి మణికట్టు వద్ద గాయం చేసుకుంది. దీంతో చేతి నరాలు తెగి తీవ్ర రక్తస్రావమవుతుండటంతో పోలీస్‌స్టేషన్‌లోకి పరుగున వెళ్లింది. దీనిని గమనించిన ఎస్‌ఐ సతీష్ ఆమెను చికిత్స నిమిత్తం పోలీస్ వాహనంలో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన అనంతరం చేతి స్పర్శ లేకపోవడంతో మెరుగైన వైద్యం కోసం ఆమె కుటుంబసభ్యులు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. పదేళ్లుగా పుట్టింటి వారినుంచి వచ్చిన ఆస్తి కోసం పోరాడుతుండగా అధికారులు పట్టించుకోవడం లేదని, తనకు డీఎన్‌ఏ పరీక్ష నిర్వహించి పసుపు కుంకుమల కింద అప్పగించిన ఆస్తి దక్కేలా అధికారులు చర్యలు తీసుకొని న్యాయం చేయాలని విజయ కోరుతుంది. సంఘటన జరిగిన ప్రదేశం వన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి రావడంతో దీనిపై కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'ఆరు గ్యారెంటీలు' కంటే విద్యార్థుల ప్రాణాలకు గ్యారెంటీ ఇవ్వండి

ఇమాంపేటలో విద్యార్థిని మృతిపై విచారణ జరపాలి

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్




సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలం ఇమాంపేట గురుకుల పాఠశాల ఎదుట ధర్నాలో పాల్గొన్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్

సూర్యాపేట రూరల్, ఫిబ్రవరి 11: ఎన్నికల్లో గెలవడానికి సీఎం రేవంత్‌రెడ్డి తెచ్చిన ఆరు గ్యారెంటీల కంటే రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లల ప్రాణాలకు గ్యారెంటీ ఇవ్వాలని బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలంలోని ఇమాంపేట గ్రామ గురుకుల పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని వైష్ణవి మృతికి రీజనల్ కోఆర్డినేటర్(ఆర్సీవో), ప్రిన్సిపాల్ కారణమంటూ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆందోళన నిర్వహించారు. వారికి మద్దతుగా ఆందోళనలో పాల్గొన్న ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, ఎన్నికల హామీలు అమలుచేయకపోయినా వచ్చే నష్టమేమీలేదని, ఉజ్వల భవిష్యత్ ఉన్న విద్యార్థినుల ప్రాణాలను ప్రభుత్వం కాపాడాలని డిమాండ్ చేశారు. భువనగిరిలో విద్యార్థినుల ఆత్మహత్యల ఘటనను మరవక ముందే సూర్యాపేటలో విద్యార్థిని మృతిచెందడం బాధాకరమన్నారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చింది ఇందుకేనా? అని మండిపడ్డారు. ఆదాయం వచ్చే శాఖలకు మంత్రులను కేటాయించారని, గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖలకు ప్రత్యేక మంత్రిని కేటాయించకపోవడం బాధాకరమన్నారు. భువనగిరి గురుకులంలో విద్యార్థినులు మృతి చెందితే ప్రభుత్వం రెండు నిముషాలు మౌనం పాటించకపోవడం హేయమైన చర్య అని అన్నారు. ఇమాంపేట గురుకులంలో విద్యార్థిని చనిపోతే తల్లిదండ్రులకు భరోసా కల్పించడానికి మంత్రి, ఎమ్మెల్యే, సంబంధిత శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు రాకపోవడం సిగ్గుమాలిన చర్యకు పరాకాష్ట అని అన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలు, పాలపక్షాలు పరస్పరం తిట్టుకుంటున్నాయని, ఒకరు శ్వేత పత్రం అంటారని, మరొకరు నల్లపత్రం అంటారని, పిల్లల జీవితాల గురించి పట్టించుకునే నాథుడేలేడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ హాస్టళ్లల్లో విద్యార్థినులు ఒత్తిడికి గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వీటిపై ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ గురుకులంలో విద్యార్థినుల మనోభావాలను అర్థం చేసుకోవడానికి సైకాలజిస్టు, కౌన్సిలర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. వైష్ణవి మృతిపై ప్రభుత్వం విచారణ జరిపించి బాధ్యులను సస్పెండ్ చేయాలని, మృతురాలి కుటుంబానికి రూ.1కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

సుమారు 2.4 కిలోల గంజాయి స్వాధీనం



విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాహుల్‌హెగ్డే

సూర్యాపేటక్రైం, ఫిబ్రవరి 11: నిషేధిత గంజాయిని పీల్చుతూ, ఇతరులకు విక్రయిస్తున్న యువకులను సూర్యాపేట జిల్లా చిలుకూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ రాహుల్‌హెగ్డే బీకే జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆదివారం ఉదయం విశ్వసనీయ సమాచారం మేరకు చిలుకూరు పోలీసులు మండల పరిధిలోని బేతవోలు గ్రామశివారులోగల మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంక్ వద్ద ఐదుగురు యువకులు గంజాయిని తాగుతూ ఉన్నారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి విచారించారు. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా టేకులపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్‌గా పనిచేసే బోడ సురేష్, అదే గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ బానోత్ మోహన్, అదే గ్రామానికి చెందిన డ్రైవర్‌గా పని చేసే భూక్యా అఖిల్, ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బచ్చోడు తండాకు చెందిన వ్యవసాయ పనులు చేసే ధరావత్ వినోద్, ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం మంగలితండాకు చెందిన ప్రైవేటు ఉద్యోగి నునావత్ సాయి, సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన గణపారపు శ్రీకాంత్‌లు స్నేహితులు. వీరందరు కొంత కాలంగా గంజాయికి అలవాటు పడ్డారు. దీంతో ఆంధ్రప్రదేశ్-ఒడిశా సరిహద్దులో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి కిలో గంజాయిని రూ.4500 కొనుగోలు చేసి వారు పీల్చడంతోపాటు సూర్యాపేట జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా నునావత్ సాయి అతడి స్నేహితుడైన వినోద్‌కు ఫోన్ చేసి బేతవోలుకు చెందిన శ్రీకాంత్‌కు తమ వద్ద గంజాయిని విక్రయిద్దామని అతడు వారి గ్రామ సమీప ప్రాంతంలో ఇతరులకు విక్రయిస్తాడని చెబుతాడు. దీంతో ఈ నెల 10వ తేదీన బోడ సురేష్, భూక్యా అఖిల్‌కుమార్, బానోత్ మోహన్ ముగ్గురు కలిసి వారి వద్ద ఉన్న సుమారు రెండు కిలోల గంజాయిని తీసుకుని సురేష్ బైక్‌పై వినోద్ వద్దకు వెళ్లి అతడి వద్ద ఉన్న సుమారు 400 గ్రాముల గంజాయిని తీసుకున్నారు. అక్కడి నుంచి నలుగురు కలిసి బేతవోలు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. దీంతో బోడ సురేష్ బైక్‌పై అఖిల్, బస్సులో మోహన్, వినోద్ మునగాల మండల పరిధిలోని బరాఖత్‌గూడెం చేరుకున్నారు. అక్కడి నుంచి ఆటోలో బేతవోలు గ్రామ శివారులోని మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంక్ సమీపంలో గల సాయిలి నవీన్ యొక్క మామిడి తోటకు వెళ్లారు. వారు వచ్చిన విషయాన్ని శ్రీకాంత్‌కు తెలపగా శ్రీకాంత్ మామిడితోటకు వెళ్లాడు. అక్కడ ఐదుగురు కలిసి గంజాయి తాగుతుండగా వారిని అదుపులోకి తీసుకున్నారు. అదే విధంగా వారి వద్ద సుమారు రూ.37వేల విలువైన రెండు కిలోల 400 గ్రాముల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తాగుతూ, ఇతరులకు విక్రయిస్తున్న పైఆరుగురు యువకులపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఐదుగురు యువకులను కోర్టుకు రిమాండ్‌కు తరలించగా నునావత్ సాయి పరారీలో ఉన్నాడు. సమావేశంలో అదనపు ఎస్పీ మేక నాగేశ్వర్‌రావు, కోదాడ రూరల్ సీఐ రామక్రిష్ణారెడ్డి, చిలుకూరు ఎస్‌ఐ శ్రీనివాస్, సిబ్బంది వెంకటేశ్వర్లు, నరేష్, నగేష్, అలీమోద్దిన్ ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

చౌటుప్పల్ టౌన్, ఫిబ్రవరి 11: క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని శ్రీగాయత్రి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ బీమిడి సుభాష్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్ పట్టణంలోని శ్రీగాయత్రీ జూనియర్ కళాశాల వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు ప్రోత్సహక బహుమతులు అందజేశారు. విద్యార్థినుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

23నుంచి రాయిగిరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మునిసిపల్ వైస్‌చైర్మన్ తదితరులు

భువనగిరి రూరల్, ఫిబ్రవరి 10: భువనగిరి శివారులోని రాయిగిరి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ వైస్‌చైర్మన్ చింతల కిష్టయ్య తెలిపారు. బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్న్య హన్మంత్‌నాయక్, కళ్లెం బాల నర్సింహ, మేకల బాల నర్సింహ, భిక్షపతి, భద్రప్ప, ఎల్లేష్, రమేష్, రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పారిశుధ్య వారోత్సవాలు

భువనగిరి రూరల్, ఫిబ్రవరి 10: పారిశుధ్య వారోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయడంతో పాటు పరిసరాల్లో చెత్తా చెదారం తొలగించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుత్తా నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ అంజిరెడ్డి, ఎంపీవో అనురాధదేవి, డీటీ మంజులారెడ్డి, ప్రత్యేక అధికారులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 11: వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆదివారం భువనగిరిలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి నిజయాతీ నిజాభిషేకం, సామూహిక కుంకుమార్చనలు జరిపారు. వాసవీ మాత ఆత్మార్పణ విశిష్టతను ఆలయ పూజారులు వివరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మంచికంటి వెంకటేశం, అధ్యక్షుడు కూరెళ్ల జనార్థన్, చందా ఈశ్వర్‌గుప్తా, జిల్లా వెంకటరమణ, బెలిదే ఆనంద్, ఆకుల రమేష్, బిజ్జాల మహేష్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం


ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నిర్వాహకులు

సంస్థాన్‌నారాయణపురం, ఫిబ్రవరి 11: మండలకేంద్రంలో ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు జరిగే మార్కండేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు జాతర ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆలయ కమిటీ నిర్వాహకులు ఆదివారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు సూరపల్లి కుచేలు, ఉప్పల లింగస్వామి, ముద్దంగుల నరసింహ, ధనరాజ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి


ఆలేరులో జరిగిన జూనియర్ కబడ్డీ సెలక్షన్‌లో పాల్గొన్న క్రీడాకారులు

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 11: గ్రామీణ క్రీడాకారులు క్రీడల్లో రాణించాలని కేసరి యూత్ క్లబ్ అధ్యక్షుడు రేగు బాల నర్సయ్య అన్నారు. ఆలేరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 32వ బాలబాలికల సబ్ జూనియర్స్ కబడ్డీ ఎంపిక పోటీలు ఆదివారం నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు సూర్యాపేటలో జరిగే జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పూల నాగయ్య, గంధమల్ల కుమార్, ఉదయ్‌కుమార్, చంద్రకుమార్, నరేష్, సందీప్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయానికి తాళం


భువనగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే భువనగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని అప్పటి ఎమ్మెల్యే ఖాళీ చేశారు. రెండు నెలలు నుంచి కార్యాలయం ప్రజలకు అందుబాటులోకి రాలేదు. దీంతో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని కలిసేందుకు వస్తున్న ప్రజలకు నిరాశే మిగిలుతోంది. గత ఏడాది డిసెంబరులో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం కాగానే ఎమ్మెల్యే కుంభం క్యాంపు కార్యాలయాన్ని సందర్శించి వాస్తు మార్పుల కోసం అధికారులకు సూచనలు చేశారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ ప్రకటన వెలువడక ముందే కార్యాలయాన్ని అందుబాటులోకి తేవాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ● స్టాఫ్ ఫొటోగ్రాఫర్, యాదాద్రి.

అడ్డగూడూరు పీఏసీఎస్ చైర్మన్‌పై నేడు అవిశ్వాసం


అడ్డగూడూరు సింగిల్ విండో కార్యాలయం

మోత్కూరు, ఫిబ్రవరి 11: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం, తుంగతుర్తిలోనూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ ఓడిపోయి కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్ గెలువడంతో స్థానికంగా కాంగ్రెస్ ఆధిపత్యం పెంచుకోవడానికి ముమ్మరంగా కృషి చేస్తున్నారు. అడ్డగూడూరు సింగిల్ విండోలో 13 డైరెక్టర్లు ఉండగా 9 మంది డైరెక్టర్లు చైర్మన్ పొన్నాల వెంకటేశ్వర్లుపై అవిశ్వాసం ప్రకటిస్తూ గత జనవరి 22న డీసీవోకు వినతి పత్రం అందజేశారు. అవిశ్వాస తీర్మానంపై సోమవారం (ఈ నెల 12న) ఉదయం 11 గంటలకు సంఘం కార్యాలయంలో ఓటింగ్ నిర్వహించనున్నారు. ఓటింగ్ నిర్వహణకు డీసీవో హాజరు కానున్నట్టు తెలుస్తున్నది. ఇది ఇలా ఉండగా చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటించిన 9 మంది కౌన్సిలర్లు క్యాంపులో ఉన్నారు. వారు నేరుగా ఓటింగ్ సమయానికి కార్యాలయానికి వస్తారంటున్నారు. అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించకుండా నిలిపి వేయాలని చైర్మన్ పొన్నాల వెంకటేశ్వర్లు హైకోర్టును ఆశ్రయించగా ఓటింగ్ నిర్వహించి, ఫలితం ప్రకటించకుండా నిలిపివేయాలని కోర్టు అధికారులను ఆదేశించిందని చైర్మన్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నెల 13న తదుపరి విచారణ జరుగనుందన్నారు. ఓటింగ్ నిర్వహించవచ్చని కోర్టుకూడా చెప్పడంతో సింగిల్ విండో కార్యాలయంలో ఓటింగ్ నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓటింగ్‌లో అవిశ్వాసం నెగ్గుతుందా, వీగిపోతుందా, ఈ నెల 13న విచారణ అనంతరం కోర్టు తీర్పు ఎలా ఉంటుందన్న ఉత్కంఠ మండలంలో కొనసాగుతోంది.

కాంగ్రెస్‌లో చేరిన సింగిల్ విండో డైరెక్టర్


ఎల్లమ్మను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మండల అధ్యక్షుడు లింగయ్య

అడ్డగూడూరు, ఫిబ్రవరి 11: మండల కేంద్రానికి చెందిన సింగిల్ విండో డైరెక్టర్ బాలెంల ఎల్లమ్మ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు పోలేబోయిన లింగయ్యయాదవ్ కండువా కప్పి ఆమెను పార్టీలోకి ఆహ్వానించారు. నేడు సింగిల్ విండో చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టడానికి ముందే బీఆర్ఎస్‌కు చెందిన సింగిల్ విండో డైరెక్టర్ బాలెంల ఎల్లామ్మ కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు కొప్పుల నిరంజన్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వళ్లంభట్ల రవి, రాచకొండ రమేష్, డైరెక్టర్ అశోక్‌రెడ్డి, పండుగ నరసింహ, మనుపటి బిక్షం, సురేందర్‌రెడ్డి, వేముల భిక్షం, కడారి శ్రీశైలం, జ్యోత్స్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిపై ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం


భువనగిరిలో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 11: గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ జయంతి ఫిబ్రవరి 15న రాష్ట్ర ప్రభుత్వం ఐచ్ఛిక సెలవు ప్రకటించడం హర్షణీ యమని కాంగ్రెస్ ఎస్టీ సెల్ నాయకులు అన్నారు. భువనగిరిలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. సీఎం నిర్ణయంతో గిరిజనుల తొమ్మి దేళ్ల పోరాటం ఫలించిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాములనాయక్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిరంజీవినాయక్, జిల్లా అధ్యక్షుడు క్రాంతినాయక్, రాజేందర్‌నాయక్, పట్టునాయక్ పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గిరిజనులకు సముచిత న్యాయం జరుగుతుందని చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. ఈ నెల 15 న నిర్వహించే సంత్ సేవాలాల్ నాయక్ జయంతిని కాంగ్రెస్ ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించడంతో కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల కమిటీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిల ఫ్లెక్సీల కు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ చిల్కూరీ ప్రభాకర్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు ఆంగోత్ శ్రీనివాస్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు పబ్బు రాజు, గుండు మల్లయ్య, ఉబ్బు వెంకటయ్య, శ్రీకాంత్, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు బోయ దేవేందర్, సుర్వి నర్సింహ, వి. సత్తయ్య పాల్గొన్నారు.

తెల్ల రేషన్ కార్డుదారులకు 'గృహజ్యోతి'

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 11: గృహజ్యోతి పథకం కేవలం తెల్లరేషన్ కార్డుదారులకు మాత్రమే వర్తిస్తుందని ట్రాన్స్‌కో అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఆదివారం భువనగిరి పట్టణంలోని ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన శిబిరాల్లో అర్హుల నుంచి ధ్రువీకరణ పత్రాలు స్వీకరించి అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేశారు. దీంతో శిబిరాల వద్ద సందడి నెలకొంది. అయితే ప్రజాపాలనలో దరఖాస్తూ చేయని వారికి కూడా గృహజ్యోతి వర్తిస్తుందని లబ్ధికోసం ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ శిబిరాల్లో మాత్రం ప్రజా పాలనలో దరఖాస్తు చేయని వారి ధ్రువీరకణను నమోదు చేయడానికి ట్రాన్స్‌కో సిబ్బంది నిరాకరించడంతో పలువురు నిరసనలు తెలిపారు. కాగా సోమవారం కూడా శిబిరాలు కొనసాగుతాయని ట్రాన్స్‌కో టౌన్ ఏఈ తెలిపారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యార్థులకు అన్యాయం

వలిగొండ, ఫిబ్రవరి 11: బడ్జెట్‌లో ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరించిందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లగొర్ల మోదీరాందేవ్ యాదవ్ అన్నారు. వలిగొండలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటాన్ బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7.8శాతం నిధులను మాత్రమే కేటాయించడంతో విద్యార్థులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, పెండింగ్ స్కాలర్ షిప్‌లు, నిరుద్యోగ భృతి, అంశాలే బడ్జెట్‌లో లేవన్నారు. సమావేశంలో నాయకులు గొలుసుల మధు, మల్లయ్య, విద్యారత్నం, క్రాంతికుమార్, వెంకటేశ్వర్లు, శ్రీహరి, లింగస్వామి, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రత్యేక దివ్యాంగులకు ప్రాధాన్యం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ఉపేందర్

వలిగొండ, ఫిబ్రవరి 11: ప్రత్యేక దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని ఎన్‌పీఆర్‌డీ జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ అన్నారు. వలిగొండలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. దివ్యాంగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. దివ్యాంగుల బంధు పథకాన్ని అమలు చేయాలని, వంద శాతం సబ్సిడీతో బ్యాంక్ రుణాలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు బర్ల పార్వతి, పర్వతం శ్యామల, బాలమ్మ, కొమురమ్మ, ఎదురుగుంట రవి, పద్మ, తదితరులు ఉన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి


అడ్డగూడూరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

అడ్డగూడూరు, ఫిబ్రవరి 11: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని తుంగతుర్తి అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ కూరాకుల వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని ధర్మారంలో ఆదివారం జరిగిన గావ్ చలో-అభియాన్‌లో మాట్లాడారు. దేశంలో అవినీతి మరకలేని పాలన నరేంద్ర మోదీకే సాధ్యమన్నారు. దేశంలో సుమారు ఐదు వేల కిలో మీటర్ల జాతీయ రహదారులు నిర్మించారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేకల ఇమ్మనియేలు, బాల్నే పెద్ద భిక్షం, పూలపల్లి శంకర్‌రెడ్డి, మరాఠీ కుమారు, పూలపల్లి కృష్ణారెడ్డి, చిప్పలపల్లి రాములు ఉన్నారు.

భూదాన్‌పోచంపల్లి: మండల పరిధిలోని జూలూరు గ్రామంలో ఆదివారం బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు గంగదేవి విజయ్ ఆధ్వర్యంలో 'గావ్ చలో - అభియాన్ ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ సర్కారు పేద ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజలకు బీజేపీ సర్కారుపై విశ్వాసం పెంచేవిధంగా ప్రచారం నిర్వహించారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ మళ్లీ అధికారంలోకి రావాలని, అందుకోసం బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూలూరు 151వ బూత్ అధ్యక్షుడు వట్టిపల్లి శ్రవణ్, మండల బీజేపీ అధ్యక్షుడు మేకల చొక్కారెడ్డి, మండల కార్యదర్శి పల్లెకాడి బస్వయ్య, ఓబీసీ జిల్లా అధికార ప్రతినిధి గోదాసు లింగస్వామి, సీనియర్ నాయకులు సదానందం పాల్గొన్నారు.

నేటి నుంచి మార్కండేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 11: పద్మశాలి చేనేత కులదైవం మార్కండేశ్వర స్వామి కొలువైన భూదాన్‌పోచంపల్లి మార్కండేశ్వరస్వామి దేవాలయం 47వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 12 నుండి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని దేవస్థానం అధ్యక్షుడు బడుగు చండికేశ్వర్ తెలిపారు. పట్టణంలోని మార్కండేశ్వరస్వామి దేవాలయాన్ని బ్రహ్మోత్సవాలకు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉత్సవాల వివరాలను అధ్యక్షుడు బడుగు చండికేశ్వర్, ఉపాధ్యక్షుడు బోగ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి రుద్ర బాలరాజు, కోశాధికారి మంగళపల్లి రాజారమేష్ వివరించారు. ఈ నెల 12న మార్కండేయ మహర్షి జన్మదినోత్సవం, 13న విఘ్నేశ్వరస్వామి పూజ, ధ్వజారోహణము, 14న శివప ంచాయతన యజ్ఞం, సాయంత్రం సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం, 15న లక్షబిల్వార్చన, 16న ఉదయం లక్షగాయత్రి మహాయజ్ఞం, సాయంత్రం భద్రావతీ భావనాఋషి కల్యాణోత్సవం, 17న శనివారం సాయంత్రం పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం, ఈనెల 18న సహస్రఘటాభిషేకం, ఈనెల 19న స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కుంభం


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ, ఫిబ్రవరి 11: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. వలిగొండ మండలకేంద్రం, పలు గ్రామాల్లో ఆదివారం అభివృద్ధి పనులను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. వేములకొండ పీహెచ్‌సీలో వైద్యులు ప్రజలకు మెరుగైన సేవలు అందించడం అభినందనీయ మన్నారు. ఆస్పత్రికి ప్రహరీ, ఆయుష్ వైద్యశాలకు ప్రత్యేకంగా గది నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. సాగునీటి కాల్వలో బునాదిగాని ధర్మారెడ్డిపల్లి, పిలాయిపల్లి కాల్వల ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటామన్నారు. 2026లో డీలిమిటేషన్ ఉందని దీని వల్ల అసెంబ్లీ పార్లమెంట్, జిల్లాల పరిధులు మారే అవకాశం ఉందని అన్నారు. వేములకొండ నూతన మండలంపై ప్రజల అభీష్టం మేరకు ప్రభుత్వం ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటుందన్నారు. అంతక ముందు ఎఫ్ఎస్‌సీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచితం కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేష్‌రాజు, జడ్పీటీసీ వాకిటి పద్మ అనంతరెడ్డి, వైస్ ఎంపీపీ బాతరాజు ఉమాబాలనర్సింహ, ఎంపీటీసీలు పలుసం రమేష్, యశోద, భాగ్యమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించాలి

రామన్నపేట, ఫిబ్రవరి 11: మెగా డిఎస్సీ ప్రకటించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గతంలో వేసిన 5089 పోస్టులకు మరో 15వేల పోస్టులు కలిపి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వేసి ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఇటీవల ప్రకటించిన డీఎస్సీకి తక్కువ పోస్టులు ఉండడంతో ఒక్కో జిల్లాలో అసలు పోస్టులే లేకపోవడంతో కేవలం 1.77లక్షల మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఊరికో బడి అని ప్రకటించిన ప్రభుత్వం ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి : కంచర్ల


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కంచర్ల రామకృష్ణారెడ్డి

మోత్కూరు, ఫిబ్రవరి 11: కేఆర్ఎంబీ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వానికి అప్పగించవద్దన్న డిమాండ్‌తో మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ఈ నెల 13న నల్లగొండలో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మోత్కూరులో బహిరంగ సభ వాల్ పోస్టర్లు ఆదివారం విడుదల చేసి మాట్లాడారు. కృష్ణానది మేనేజ్‌మెంట్ బోర్డు బాధ్యతలను కేంద్రానికి అప్పగిస్తే 14కొత్త జిల్లాలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఆ జిల్లాలకు సాగు నీరే కాదు తాగు నీరు కూడా అందకుండా పోతుందన్నారు. ప్రాజెక్టులకు ఏ చిన్న మరమ్మతులు చేయాలన్నా కేంద్ర ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నేవూరి ధర్మేందర్‌రెడ్డి, పొన్నెబోయిన రమేష్, బొడ్డుపల్లి కళ్యాణ్‌చక్రవర్తి, సింగిల్ విండో చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ యాకూబ్‌రెడ్డి, సోంమల్లు, మర్రి అనిల్‌కుమార్, మల్లేష్ పాల్గొన్నారు.

అరకొర నిధుల కేటాయించి హామీలు ఎలా అమలు చేస్తారు

ఎన్నికల్లో తాము ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలు ఖచ్చితంగా అమలు చేస్తామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు అరకొరగా కేటాయించిందని, అరకొర నిధులతో హామీలు ఎలా అమలు చేస్తారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. మోత్కూరులో విలేకరులతో మాట్లాడారు. గత బడ్జెట్‌లో తమ(బీఆర్ఎస్) ప్రభుత్వం వ్యవసాయ రంగానికి రూ.25వేల కోట్లు కేటాయించగా ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.19 వేల కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. గతం కంటే రూ.6వేల కోట్లు తక్కువ నిధులు కేటాయించి రైతు భరోసా ఎకరాకు రూ.15 వేలు, రూ.2లక్షల రుణమాఫీ ఎలా చేస్తుందన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 11: చేనేత పరిశ్రమను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న దేశవ్యాప్త సమ్మెను జిల్లాలో విజయవంతం చేయాలని చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుండు వెంకటనర్సు అన్నారు. ఆదివారం భువనగిరిలో జరిగిన సంఘం సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో నాందేవ్, చింతకింది సోమరాజు, లక్ష్మణ్ ఉన్నారు.

భువనగిరి టౌన్: అంతర్ జిల్లా అబాకస్ మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో భువనగిరి శ్రీసాయి ప్రశాంతి విద్యా నికేతన్ విద్యార్థులు ప్రతిభ చూపారు. జనగాంలో ఆదివారం జరిగిన టాలెంట్ టెస్ట్‌లో మూడు జిల్లాల విద్యార్థులు పాల్గొనగా సీనియర్ విభాగంలో కొత్తపల్లి సాయి విగ్నేష్ మొదటి బహుమతి, జూనియర్ విభాగంలో అశుతోష్ ద్వితీయ బహుమతి సాధించారు. బహుమతులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ తోటకూరి యాదయ్య, అబాకస్ ఉపాధ్యాయురాలు కొడారి కళ్యాణి అభినందించారు.

చౌటుప్పల్ టౌన్: శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యతనిస్తామని చౌటుప్పల్ నూతన సీఐ అశోక్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం దండు మల్కాపురంలోని నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు దేప శ్యామ్ సుందర్ ఆదివారం సీఐ అశోక్‌రెడ్డిని సన్మానించారు. పోలీస్ శాఖ కు పూర్తి సహాయ సహకారాలను అందిస్తామని తెలిపారు.

మోత్కూరు: మండలంలోని దత్తప్పగూడెం గ్రామానికి చెందిన నిరుపేద ఎలుగు అవిలయ్య గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవడానికి రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో మంజూరైన రూ.1.50 లక్షల ఎల్‌వోసీని మాజీ ఎంపీటీసీ ఎలుగు పార్వతమ్మయాదయ్య ఆదివారం లబ్ధిదారునికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు చింత చంద్రయ్య, తొంట నరేందర్, వల్లందాసు వెంకన్న, తొంట బాస్కర్, మల్లేష్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరు: పదవీకాలం ముగిసిన మాజీ సర్పంచులను మదర్ డెయిరీ డైరెక్టర్ రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి ఘనంగా సన్మానించారు. వారికి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి. మనోహర్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంటు రచ్చ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరు: మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంలో మజీద్ ఈ నూర్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా అబ్దుల్‌నబీ, ఫకీర్ అహమ్మద్, అధ్యక్షుడిగా మహమ్మద్ ఇబ్రాహీం, ఉపాధ్యక్షులుగా ఖాసీం, అమీర్, ప్రధాన కార్యదర్శిగా సమీరుద్దీన్, కోశాధికారిగా ఖలీల్, సహాయ కార్యదర్శిగా జానీ, ప్రచార కార్యదర్శిగా షాకీరుద్దీన్‌తో పాటు ఐదుగురు ముఖ్య సలహాదారులుగా మరో పది మందిని

సంక్షిప్త సమాచారం..

కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఆలేరు రూరల్: మండలంలోని రాఘవపురంలో ఎంపీ నిధులు రూ.లక్ష నుంచి కొనుగోలు చేసిన వీధి లైట్లను ఎంపీటీసీ ఆరె ప్రశాంత్ గౌడ్ ప్రారంభించారు. పార్టీలకతీతంగా ప్రజలు అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మేకల ఉపేందర్, మాజీ ఎంపీటీసీ నెమిల రాజయ్య, శ్రీశైలం, తుంగ కుమార్, సాంబరాజు మల్లయ్య, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.



రాజాపేట: మండలం చల్లూరు యాదాద్రి మేడారంలో ఆదివారం మండమెలిగే పండుగలో భాగంగా జెండా ఆవిష్కరణ చేశారు. సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులు, భక్తులు డప్పు వాయిద్యాలతో ఊరగుట్ట పడమటి గుట్టలపై ఉన్న సమ్మక్క సారలమ్మల ఆలయాల వద్దకు వెళ్లి పూజలు నిర్వహించారు. జెండాలను ఆవిష్కరించారు.

ఆలేరు రూరల్: గ్రామాభివద్ధికి కృషి చేసిన తాజా మాజీ ప్రజా ప్రతినిధులను ఆదివారం మండలంలోని శారాజీపేటలో ఆ గ్రామ మాజీ ఎంపీటీసీ రచ్చ రాంనర్సయ్య సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బండ పద్మ మాజీ ఉపసర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాయికుమార్, సురేష్, శారద, అశోక్, అనిత, బాలమణి, మహేందర్ తదితరులు ఉన్నారు.



మోటకొండూరు: తెలంగాణ అసెంబ్లీ వ్యవహారాల సలహా కమిటీ సభ్యుడిగా ఎన్నికైన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను ఆయన నివాసంలో మోటకొండూర్ కాంగ్రెస్ నాయకులు పూల మొక్క, నోట్ బుక్స్ అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాల్ద వెంకటేష్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుగ్గ శ్రీనివాస్, రేగు చంద్రశేఖర్, భూమండ్ల బంగారి, వట్టిపల్లి మధు, కొండ మహేష్, మిర్యాల శ్రీకాంత్, రేగు అశోక్, దేవసాని నాగరాజు, బోలగాని ప్రవీణ్, సత్యనారాయణ, భూమండ్ల మహేష్ పాల్గొన్నారు.

భువనగిరి టౌన్: జిల్లాకేంద్రం భువనగిరి పట్టణానికి చెందిన మాజీ పట్వారి వంగేటి రంగారెడ్డి(95) ఆదివారం మృతిచెందారు. పట్వారిగా, ల్యాండ్ సర్వేయర్‌గా భువనగిరి పరిసర ప్రాంతాల్లో ఆయన అందరికీ సుపరిచితుడు. ఆయన రెండో కుమారుడు సీనియర్ న్యాయవాది వంగేటి విజయ భాస్కర్‌రెడ్డి రాష్ట్ర బీజేపీ లీగల్ సెల్ సభ్యుడుగా ఉన్నారు. అలాగే భువనగిరి పట్టణ టీఆర్ఎస్ మొదటి ప్రధాన కార్యదర్శి, ఆ పార్టీ సీనియర్ నాయకుడు రావుల శ్రీనివాస్(49) అనారోగ్యంతో మృతిచెందాడు. అతని భార్య రాధా అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్నారు. అతనికి కూతురు, కుమారుడు ఉన్నారు. పలువురు ప్రముఖులు వీరిద్దరి మృతదేహాలను సందర్శించి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు.